క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో తీవ్రగాయాలతో యువకుడు రాజు

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రోడ్డులో వండవ సెంటర్ దగ్గరలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వాసు రాజు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పాలకొండ మండలంలోని ఆర్‌బీఆర్ పేటకు చెందిన రాజు తన ద్విచక్ర వాహనంపై వీరఘట్టం వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతడిని ఢీకొట్టింది. దీంతో కిందపడిన రాజుకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు చికిత్స నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి క్షతగాత్రుడిని తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉన్నత వైద్య సేవల కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

గుమడలో 'ఫ్యామిలీ డాక్టర్'



మంచంపై చికిత్స పొందుతున్న వృద్ధురాలి ఆరోగ్యం పరీక్షిస్తున్న వైద్యాధికారి అరుణ్‌కుమార్

కొమరాడ: మండలంలోని గుమడ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కొమరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ అరుణ్‌కుమార్, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి, రోగులను పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు, పాఠశాల విద్యార్థులకు కూడా వైద్య పరీక్షలు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భద్రగిరి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ కమలకుమారి తదితరులు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల విద్యార్థినులు ఎం.కీర్తి, ఎ.సలోమి, బి.వైశాలి, ఎం.ప్రభావతి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి శనివారం తెలిపారు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా కేంద్రంలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఆయా విద్యార్థినులు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా విద్యార్థినులను ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ షన్ముఖరావు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటింటి కుళాయి పనులకు శంకుస్థాపన



కుళాయి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న కౌన్సిలరు ధనలక్ష్మి

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలో 9వ వార్డులో ఇంటింటి కుళాయి నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కౌన్సిలర్లు పల్లా ధనలక్ష్మి తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి, అందరికీ తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పల్లా భాను తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలు



మాట్లాడుతున్న నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: పక్కాగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం చేసిన ప్లాస్టిక్, పాలిథిన్ నిషేధాన్ని అందరూ తప్పనిసరిగా పాటించాలని కోరారు. 120 మైక్రాన్‌ల లోపు ఉండే అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడం జరిగిందన్నారు. ప్లాస్టిక్ బ్యానర్లు, పేపర్లు, ఆహ్వాన పత్రికలు, గ్లాసులు, కప్పులు, ప్లేట్లు, స్పూన్లు, పీవీసీ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఎక్కడ విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తామని, నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులు అమ్మితే జరిమానా విధించడంతో పాటు షాపుల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. శనివారం మండలంలోని దోనుబాయి గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న దోనుబాయి, రూపాయి గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె మూడున్నరేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ క్రమంలో పాలకొండ–దోనుబాయి ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలని, రూపాయి గ్రామానికి రహదారి నిర్మించాలని, కొత్త ఇళ్లు మంజూరు చేయాలని, బోరు మరమ్మతులు, కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేయగా, ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క ప్రభుత్వ పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే న్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.గీతాంజలి, పీఆర్ జేఈ కిరణ్‌కుమార్, ఉపాధి ఏపీఓ బాబురావు, ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీటీసీ ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు వెంకునాయుడు, రామారావు, ఎంపీటీసీలు జి.కోటేశ్వరరావు, చంద్రరావు, బి.లక్ష్మి, హరిబాబు, ఏఎంసీ చైర్మన్ మోహన్‌రావు, పార్టీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.లక్ష్మి, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.గోపాల్, వెంకీ, అబ్బాస్, సింహాచలం, ఎం.రామారావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ర్యాలీ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

పాలకొండ రూరల్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ట్రాకర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని కొండాపురం గ్రామంలో ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్‌లు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తూ సామాన్యుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ముఖ్యంగా రైతుల సమస్యల పరిష్కరించడంలో తీవ్ర విఫలమైందన్నారు. గతంలో నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. ఆ హామీలను నెరవేర్చాలని కోరుతూ చేపట్టే ర్యాలీకి అందరూ విచ్చేసి, కార్యక్రమం జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కె.రామూర్తి నాయుడు, రాయి రామకృష్ణ, బలగ దుర్గారావు, పారినాయుడు, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు

కురుపాం: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్ భాస్కరరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజ సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించిన వారు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం చేతులు, వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. తర్వాత విద్యార్థుల వసతిగృహం, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు రుచికరమైన పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు జి.రామగోవింద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన తప్పనిసరి



హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న గీతారాణి

గుమ్మలక్ష్మీపురం: హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్)పై అవగాహన తప్పనిసరి అని వై.డి.ఓ నెట్‌వర్క్ ఓఆర్‌డబ్ల్యూ ఎ.గీతారాణి అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట గ్రామ ప్రతిభా భారతి కాలనీలో యువతకు ప్రాణాంతక హెచ్‌ఐవీపై శనివారం అవగాహన కల్పించారు. రక్తమార్పిడి, తల్లిపాలు, సురక్షితం కాని కలయిక, సూదుల ద్వారా హెచ్‌ఐవీ సోకుతుందని వివరించారు. హెచ్‌ఐవీ సోకిన వ్యక్తి ఎయిడ్స్ వ్యాధి బారినపడి మరణించే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ దీనిపై అవగాహన కలిగి, ప్రాణాంతక వ్యాధి బారినపడకుండా జాగ్రత్త వహించాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: అర్హతే ప్రామాణికంగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. శనివారం మండలంలోని గెద్దతిరువాడ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె మూడున్నరేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆయన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు తీసుకువచ్చేందుకు ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల సేవలు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే న్యాయం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మహిళా సంఘ అధ్యక్షురాలు అల్లు ఉషారాణి, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, నాయకులు బంకురు శంకరజోగినాయుడు, బడే చిన్నంనాయుడు, అల్లు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ మురళీధర్ తదితరులు

పాలకొండ: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని సీఐ మురళీధర్ కోరారు. స్థానిక పాతబస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. అతివేగం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలతో వెళ్లకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. ప్రతీ ఒక్క వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వృద్ధులకు దుస్తులు అందిస్తున్న దాతలు

వీరఘట్టం: మండలంలోని నడుకూరు గ్రామంలో సాయిమారుతీ షిర్డీసాయిబాబా 24వ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామంలోని భక్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు ఆలయానికి విచ్చేసి, బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా అన్నదానం, పేదలకు దుస్తుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో బీవీఏ నాయుడు, ఆశాలత, బీపీ నాయుడు, ఎం.బాబూరావు, వి.కృష్ణ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

కురుపాం: మండల పరిధిలో ఎస్‌ఈబీ పలుచోట్ల చేపట్టిన దాడుల్లో సీజ్ చేసిన ఏడు ద్విచక్ర వాహనాలు, ఓ ట్రాక్టరును ఈ నెల 25వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ సీహెచ్ ప్రసాద్ శనివారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే వేలంలో ఆసక్తి కలిగిన వారు పాల్గొని, వాహనాలను సొంతం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న దివ్యనామ సంకీర్తన

పాలకొండ రూరల్: స్థానిక సత్యసాయి శివం మందిరంలో శనివారం నిర్వహించిన దివ్యనామ సంకీర్తన ఆకట్టుకుంది. కార్యక్రమం అనంతరం నిరుపేదలకు నిత్యవసర సరుకులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు, సాయి సేవా సమితి సభ్యులు దుప్పాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు



కుదమ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని కుదమ పంచాయతీలో విద్యుత్‌స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు శనివారం యుద్ధప్రాతిపదికన చేపట్టారు. కొన్నిరోజుల క్రితం ఏనుగులు వాటిని ధ్వంసం చేయగా, పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బాధిత గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు స్పందించిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి విద్యుత్ పునరుద్ధరణ చర్యలకు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాద బీమా పాలసీపై అవగాహన



ప్రమాద బీమా పాలసీపై అవగాహన కల్పిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

గుమ్మలక్ష్మీపురం: తపాలా శాఖ కొత్తగా తీసుకువచ్చిన ప్రమాద బీమా పాలసీ ద్వారా రూ.396కే రూ.10 లక్షల బీమా వర్తిస్తుందని గుమ్మలక్ష్మీపురం తపాలా శాఖ ఉద్యోగులు రవికుమార్, జయంత్, వెంకటరావు తెలిపారు. తపాలా శాఖ సూపరింటెండెంట్ జీఎస్ఎన్ రాజు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమణారావు ఆదేశాల మేరకు శనివారం వారు సిబ్బందితో కలిసి ప్రమాద బీమా పాలసీపై అవగాహన కల్పించారు. ఈ పాలసీలో చేరిన వ్యక్తులు దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురై చనిపోతే రూ.10 లక్షల బీమా వస్తుందన్నారు. పాలసీలో చేరాలనుకునే వారు, ఏవైనా సందేహాల నివృత్తి కోసం దగ్గరలోని పోస్టాఫీసు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి



వలంటీర్లకు సూచనలిస్తున్న కార్యదర్శి అనసూయ

భామిని: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని సచివాలయ కార్యదర్శి అనసూయ సూచించారు. మండలంలోని నేరడి–బి గ్రామ సచివాలయంలో వలంటీర్లతో శనివారం సమావేశమైన ఆమె ఇంటి పన్ను వసూలు లక్ష్యాలను త్వరగా చేరుకోవాలన్నారు. అలాగే అర్హులకే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులు విధిగా లేబర్ సర్టిఫికెట్లు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో సుధారాణి, భాస్కరరావు పాల్గొన్నారు.

యూడైస్ వివరాలు సిద్ధం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణమూర్తి

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ కర్రి కృష్ణమూర్తి మాట్లాడుతూ యూడైస్ వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే అన్ని పాఠశాలల పూర్తి సమాచారం ఎంఆర్‌సీలో అప్‌లోడ్ చేయాలన్నారు.

సబ్జెక్టు టీచర్ల కొరతకు చెక్



చిలకలపల్లి ఉన్నత పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

బలిజిపేట: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతకు ప్రభుత్వం చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా తాత్కాలిక పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను నూతనంగా అలాట్ అయిన పాఠశాలల్లో విధుల్లో చేరే విధంగా చర్యలు చేపట్టింది. త్వరలో జరగనున్న పబ్లిక్ పరీక్షల దృష్ట్యా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది.

మండలంలో 7గురికి మార్పులు

మండలంలో ఏడుగురు ఉపాధ్యాయులకు పదోన్నతులపై మార్పులు జరిగాయి. అందులో అంపావల్లి నుంచి తెర్లాం మండలం, అజ్జాడ డీపీఈపీ నుంచి పార్వతీపురం మండలం, చిలకలపల్లి ఎంపీపీ పాఠశాల నుంచి నారాయణపురం ఉన్నత పాఠశాలకు, వెంగాపురం ఎంపీపీ నుంచి చిలకలపల్లి ఉన్నత పాఠశాలకు, బలిజిపేట ఉన్నత పాఠశాల నుంచి బొబ్బిలి మండలానికి, పెదపెంకి ఉన్నత పాఠశాల నుంచి తెర్లాం మండలానికి పదోన్నతులపై వెళ్లారు.

రూ.2,500 అలెవెన్స్

తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉన్నత పాఠశాలల్లో బోధన చేసే సబ్జెక్టు టీచర్లకు ప్రభుత్వం సబ్జెక్టు టీచర్ల అలవెన్సుగా రూ.2,500 చెల్లించనుంది. ప్రస్తుతం వారు పొందుతున్న వేతనానికి అదనంగా ఎస్‌టీఏను చెల్లిస్తారు. వీరు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలల నుంచే వేతనాలు పొందనున్నారు. బదిలీ ప్రక్రియలో న్యాయపరమైన సమస్యల పరిష్కారం అనంతరం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన స్థానాలు కేటాయించే అవకాశముంది. సర్దుబాటుకు గురైన ఉపాధ్యాయులు శనివారం విధుల్లో చేరారు.

ఎంపీడీఓ సందర్శన



అంగన్‌వాడీ కేంద్రంలో వంటకాలు రుచి చూస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: మండలంలోని టీకే రాజపురం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ డొంక త్రినాథులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారంపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం వారికి అందజేసే ఆహార పదార్థాలు రుచి చూశారు. విధిగా కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. అనంతరం బుక్కూరు, తంపటాపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయ పాలన పాటించాలని, సచివాలయానికి వచ్చే ప్రజలు, ప్రజా ప్రతినిధులను గౌరవించాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలి



మెట్టువీధిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మనసారా మళ్లీ దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పెదబోగిలి సచివాలయం – 2 పరిధిలోని మెట్టువీధి, గూడెంవీధి, మార్కెట్‌లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారోనని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ప్రజల పొందుతున్న లబ్ధి వివరించడానికి, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసారని పేర్కొన్నారు. ప్రతీకుటుంబానికి నవరత్నాల పథకం ద్వారా ఇళ్ల స్థలాలు, మౌలిక వసతులతో కూడిన పక్కా గృహాలు, ఇంటింటి కుళాయిలు, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక, కాపునేస్తం, రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలు పంపిణీ, పేదలందరికీ ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు. పెదబోగిలి – 1, 2 ఎంపీటీసీలు బి.కుసుమ, ఎస్.గౌరీ, ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, పీఆర్ ఏఈ చంద్రమౌళి, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన 'పీఎంఎస్‌ఆర్‌ఐ'



బలిజిపేట ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న పీఎంఎస్‌ఆర్‌ఐ బృందం సభ్యులు

బలిజిపేట: మండలంలోని గలావల్లి, బలిజిపేట, తుమరాడ, పెదపెంకి మూడో నంబరు పాఠశాలలను పీఎంఎస్‌ఆర్‌ఐ రాష్ట్ర ప్రత్యేక బృందం శనివారం పరిశీలించింది. గలావల్లి యూపీ పాఠశాల అధ్వానంగా ఉన్నట్టు గుర్తించారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల వద్ద తుప్పలు, డొంకలు ఉండడంపై బృందం సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎంఎస్‌ఆర్‌ఐ రాష్ట్ర ప్రత్యేకాధికారి చైతన్య మాట్లాడుతూ 15 మండలాల్లో 30 పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేసినట్టు తెలిపారు. వీటిలో 15 యూపీ, ప్రాథమిక పాఠశాలలు, 15 ఉన్నత పాఠశాలలు, ఇంటర్ విద్యతో ఉండే ఉన్నత పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇప్పటికే 12 మండలాల్లో పరిశీలనలు జరిపినట్టు తెలిపారు. పాఠశాలలకు సంబంధించి ఏడు అంశాలపై పరిశీలన చేస్తున్నట్టు తెలిపారు. పాఠశాల ఇన్‌స్ట్రక్చర్, విద్యా పరమైన అంశాలు, మధ్యాహ్న భోజనం, లైబరీ, మరుగుదొడ్లు, ల్యాబ్, ఉపాధ్యాయులు, డిజిటల్ తరగతులు తదితర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న పాఠశాలలు మాత్రమే పీఎంఎస్‌ఆర్‌ఐ పథకంలోకి వస్తాయన్నారు. వారి వెంట ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, ఎంఈఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.